



గోకవరంలో..



రాజమండ్రిలో భారీగా క్యూ

ఎండను లెక్కచేయక..



రాత్రి 9 గంటలైనా ఆగలేదు : రాజమహేంద్రవరంలో సాగుతున్న పోలింగ్

ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక అపూర్వ ఘట్టం. ఇంకా చెప్పాలంటే కనీవినీ ఎరుగని చరిత్ర. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు వరదలా పోటెత్తారు. ఉదయం ఏడు గంటలకు మొదలైన పోలింగ్.. అర్ధరాత్రి 12 గంటల వరకు సాగుతూనే ఉంది. ఎండ మండిపోతున్నా, కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించినా గంటల తరబడి క్యూలైన్లలోనే నిలబడి మరీ చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఓట్ల శాతం నమోదైంది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆల్‌టైమ్ రికార్డుగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకోవడం గమనార్హం. ఓటర్లలో ఇంత చైతన్యం ఎప్పుడూ చూడలేదని పలువురు చెబుతున్నారు. వాస్తవానికి సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉండగా అర్ధరాత్రి 12 దాటాక కూడా పోలింగ్ జరగడం, విద్యుత్‌కాంతుల మధ్య ఈ ప్రక్రియ కొనసాగడం చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. అంతిమంగా ఈ పోటెత్తిన ఓట్ల వరద ఎవరికి కలిసొస్తుందో, ఎవరిని ముంచుతుందో జూన్ 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే...!?

ఓటెత్తారు!

తూర్పున 79.43 శాతం



రాజమహేంద్రవరంలో ఓటర్ల క్యూ



కుటుంబీకులతో కలిసి ఓటేసినట్టు చూపుతున్న కలెక్టర్ మాధవీలత



ఓటేశారు : కుటుంబంతో ఓటేసి వస్తున్న అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి



యువత ఓటు పడింది : తొలి ఓటు వేసి ఆనందంగా వేలు చూపుతున్న యువతరం



ఓటు వేయించడానికి తీసుకొచ్చారిలా..

- రాత్రి 12 గంటల వరకూ పోలింగ్
- ఓటేయడానికి కదిలొచ్చిన జనం
- భారీగా పెరిగిన క్యూలు
- పెరిగిన పోలింగ్ శాతం
- రాజానగరంలో 86.16
- రాజమండ్రిలో 66.72 శాతమే
- అక్కడక్కడా స్వల్పఘటనలు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జనం ఓటెత్తారు.. గతంలో ఎన్నడూ లేనంతగా క్యూకట్టారు.తెలంగాణ, బెంగళూరు, చెన్నై, వంటి ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి ఓటర్లు వరదగా గోదావరికి పోటెత్తారు. కొంత మంది కుర్రాళ్లు పుట్టుకతో వృద్ధులు అన్నట్టు కొందరు ఓటర్లు ఇంకా వాస్తవాలను అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు.వాళ్ల సంఖ్య తక్కువే. ఆలోచనాపరులదే పైచేయిగా అంచనా ఉంది. సాధారణంగా ఎన్నికలంటే విద్యావంతులు, మధ్య, ఉన్నతవర్గాల మహిళలు ఎక్కువగా రారు.ఈ సారి అందరూ ఓటెత్తడం గమనార్హం.ఉదయం 7గంటల నుంచి పోలింగ్ మొదలైంది.హోటళ్లు ఒకటో రెండో మాత్రమే తెరవడం వల్ల ఇబ్బంది కలిగినా, ఓటర్లు నీరసపడలేదు.ఎండను లెక్కచేయలేదు. మధ్యాహ్నం ఒంటి గంటకు క్యూలే ఉన్నాయి. రాత్రి 9 గంటలకు జిల్లాలో 76.8 శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 5 గంటలకే జిల్లాలో 66.55 శాతం ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకే ఓటు హక్కు విని యోగానికి అవకాశం ఉండేది. ఈ సారి మరో గంట పెంచి ఆరు గంటల వరకూ గడువిచ్చినా సమయం సరిపోలేదు. దీంతో 6 గంటలకే పోలింగ్ బూత్‌లకు చేరుకున్న ఓటర్లందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించినట్టు జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. జిల్లాలో 1557 పోలింగ్ బూత్‌లు ఉండగా రాత్రి 7.30 గంటలకు కేవలం 470 బూత్‌లలో పోలింగ్ పూర్తయింది. మిగతా 1107 బూత్‌లలో రాత్రి 9 గంటల తర్వాత పోలింగ్ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో పోలింగ్ శాతం ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జిల్లా సగటు పోలింగ్ శాతం 81.53 శాతంగా ఉంది. ఈసారి దీనిని దాటి పోతున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా రాత్రి 9 గంటలకు 12,46,557 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 76.8 శాతం. పురుషులు జిల్లాలో మొత్తం 7,92,317 మంది ఉండగా 6,09,979 మంది ఓటేశారు.ఇది 76.99 శాతం.మహిళలుజిల్లాలో మొత్తం 8,30,735 మంది ఉండగా 6,36,517 మంది ఓటు వేశారు. ఇది 76.62 శాతం. ట్రాన్స్‌జెండర్లు 97 ఉండగా 61 మంది ఓటేశారు.ఇది 62.89 శాతం. రాజ మహేంద్రవరం లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్ బూత్ వద్ద వైసీపీ ప్రచారం చేస్తుంటే యువకులు తిరగబడడం గమనార్హం. వైసీపీకి వేయమని కొందరు చెబుతుండగా ఎందుకు వేయాలని ప్రశ్నించారు. నిడదవోలు ఎమ్మెల్యేవైసీపీ అభ్యర్థి జి.శ్రీని వాసనాయుడు కాటకూటేశ్వరంలో బూత్ వద్ద ప్రచారం చేస్తుంటే ఓటర్లు తిరగబడడం గమనార్హం. ఇక్కడ ఎందుకు ప్రచారం చేస్తున్నారని గొడవ చేయడంతో టీడీపీ వర్గాలు అక్కడకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే పోలీసులకు ఫోన్ చేయడంతో వారొచ్చి అందరినీ చెదరగొట్టారు. ఎమ్మెల్యే చక్కగా జారుకున్నారు. నిడదవోలు టౌన్‌లో ఐదు గంటల సమయంలో మళ్లీ ఎమ్మెల్యే బూత్‌లో వెళ్లడానికి ప్రయత్నించగా అక్కడ ఎస్ఐ వద్దని చెప్పారు. అయినా వినకుండా వెళ్లడంతో అక్కడ ఉన్న ఏబీఎన్ రిపోర్టర్ సెల్‌లో విజువల్స్ తీయడం చూసిన ఎమ్మెల్యే ఆగ్రహంగా వచ్చి సెల్‌ఫోన్ తీసుకుని, అందులో విజువల్స్ డిలీట్ చేయడం వివాదాస్పదమైంది. వైసీపీ నేతలు కొందరు ఉద్యో గులపై తప్పుడు ఫిర్యాదులు చేసి ఇరికించడం గమనార్హం. నల్లజర్లలో ఓ అంగన్‌వాడీ ఓ మూగ వ్యక్తిని తీసుకుని వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయించిందని ఆరోపిస్తూ ఆమెపై ఫిర్యాదు చేశారు. అదే మండలంలో ఓ మహిళా టీచర్ టీడీపీకి ఐదు ఓట్లు వేయించారని ఆరోపిస్తూ ఆమెపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం వివాదంగా మారింది. అనపర్తి నియోజకవర్గం రంగాపురంలో టీడీపీ సానుభూతి పరులైన మహిళలపై వైసీపీ మూకలు రాళ్లు విసరడంతో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. అంతకుమించి ఈసారి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టే చెప్పవచ్చు. పోలింగ్ సరళిని చూసి వైసీపీ నాయకుల ముఖాలు బేలగా మారి పోయాయి. దీంతో లాలా చెరువు స్కూల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద వైసీపీ నాయకులు మధ్యాహ్నం తర్వాత డబ్బుల పంపిణీకి తెరతీశారు. ఓటరు స్లిప్పులతో సంబంధం లేకుండా చేతిలో రూ.500 నోట్లు పట్టుకుని ఓటర్లకు చాలా గుట్టుగా ముట్టజెప్పారు. ఒక్కో ఓటరుకు రూ.500 నోటును చేతిలో పెట్టారు.

ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరం వరకూ వాహనాలు నిలపకూడదు. గుంపులుగా జనం ఉండకూడదు. వైసీపీ ఈ నిబంధనను యథేచ్ఛగా ఉల్లంఘించింది.చున్నీలాల్ జాజు స్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషను గేటుకు కేవలం రెండు మీటర్ల దూరంలో వైసీపీ నాయకులకు చెందిన కారుని పార్క్ చేశారు. పైగా ఆ కారుకు నంబరు కూడా లేదు.పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్‌పై టీడీపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదే పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. ఓటర్లు స్వచ్ఛందంగా తరలిరావడం, పోలీసులు పక్కాబం దోబస్తు ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో పోలీసులు పెద్ద ఎత్తున పహరా కాశారు.

అర్ధరాత్రి 12 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అనపర్తి	2,26,053	1,89,398	83.78
గోపాలపురం	2,42,763	2,06,594	85.10
కొవ్వూరు	1,84,136	1,57,795	85.69
నిడదవోలు	2,13,396	1,71,377	80.31
రాజమండ్రి సిటీ	2,67,484	1,78,456	66.72
రాజమండ్రిరూరల్	2,72,826	1,99,145	72.99
రాజానగరం	2,16,491	1,86,533	86.16
తూర్పుగోదావరి	16,23,149	12,89,298	79.43



ఓటేసిన జేసీ



ఆదిరెడ్డి వాసు, భవానీ దంపతులు



కుటుంబంతో గోరంట్ల



మేము ఓటేశాం : రాజమహేంద్రవరంలో ఓటేశామని వేలు చూపుతున్న మహిళలు

మార్పు కనిపిస్తోంది..

కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 13 : ప్రజల్లో మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోందని రాజమహేంద్రవరం సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఏకేసీ కాలేజీ పోలింగ్ బూత్‌లో సోమవారం ఉదయం ఆయన తన భార్య ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తల్లి ఆదిరెడ్డి వీరాఘవమ్మ, సోదరి అపర్ణలతో కలిసి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో మార్పు అనివార్యమన్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వ విధానానికి చెంపపెట్టుగా ఈ ఎన్నికలు జరిగాయన్నారు. అధికారుల అలసత్వం కూడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సౌకర్యాలు సక్రమంగా లేవన్నారు. ప్రజలు ఇబ్బందులను ఆర్వో దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

జడ్పీ వైస్ చైర్మన్‌కి బూత్ ఏజెంట్ పాస్

తాళ్లపూడి, మే 13 : తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో జడ్పీ వైస్ చైర్మన్‌కి బూత్ ఏజెంట్ పాస్ అధికారులు మంజూరు చేయడంతో టీడీపీ వర్గీయులు కొవ్వూరు ఆర్వోకి ఫిర్యాదు చేశారు. బూత్ ఏజెంటు పాస్ తీసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంపై టీడీపీ నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి అభ్యంతరం తెలపగా వివాదం జరిగింది. దీంతో ఆర్వో ఆమెకు ఇచ్చిన పాస్ రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.



అల్లాడిన ఓటర్లు

నిడదవోలు, మే 13 : ఓటర్లు ఎండలో అల్లాడిపోయారు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోనూ చాలా చోట్ల టెంట్‌లు వేయకపోవ డంతో ఓటర్లు ఎండలోనే క్యూకట్టారు. ఎండ మండిపోవడంతో అల్లాడిపోయారు. నిడదవోలు పట్టణంలోని టక్కరిబాబా పేటలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు తూతూ మంత్రంగా ఒక టెంట్ వేసి వదిలేయడంతో ఓటర్లంతా అవస్థలు పడ్డారు. ఓటర్లు ఎండలో విసుగెత్తిపోతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవ డంతో ఎన్నికల ఏర్పాట్లపై బహిరంగంగా ప్రజలు విమర్శించారు. ఒకవైపు ఎండ, మరోవైపు కనీసం తాగునీరు అందుబాటులో లేకపోవడంతో జనం అల్లాడిపోయారు. ఓ గంటపాటు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి మమ అనిపించారు. క్యూలైన్లు భారీగా ఉండడంతో ఓ దశలో హెల్ప్‌డెస్క్ సిబ్బంది మిన్నకుండిపోయారు. పోలింగ్ స్టేషనులోకి వచ్చిన ఓటరుకు బూత్ నెంబరు చెప్పడానికి సిబ్బంది లేరు. దీంతో వృద్ధులు, పసివాళ్లతో వచ్చిన మహిళలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణంగా కనిపించింది. వారిని వీల్‌చైర్‌లో బూత్ లోపలికి తీసుకెళ్లే సహాయకులూ తగు సంఖ్యలో లేరు. మధ్యాహ్నం నుంచి ఉన్న కొద్దిపాటి మంది కనుమరుగయ్యారు. దీంతో ఆటో డ్రైవర్లు, తమ కూడా వచ్చిన వారి సహాయంతో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మెడికల్ డెస్కులు పెట్టినా జనాలకు ఉపయోగపడలేదు. వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసే ప్రయత్నం కూడా చేయలేదు.యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేశామని చెప్పినా వాస్తవంలో కొరత కనిపించింది.

1577 కేంద్రాల్లో పోలింగ్ : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మే 13: జిల్లా వ్యాప్తంగా 1577 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ మాధవీలత తన కుటుంబీకులతో కలిసి సోమవారం ఉదయం రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్దగల చున్నీలాల్‌జాజు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకుని మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలకు ప్రజలు పెద్దఎత్తున వస్తున్నారని చెప్పారు. సాయంత్రం 6 గంటకు ఎంతమంది క్యూలో నిలబడి ఓటు కోసం వేచి ఉంటారో అంతమందికి ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు.ప్రజలందరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

ముగ్గుళ్ళలో ఉద్రిక్తత..

సీతానగరం, మే 13 : సీతానగరం మండలం ముగ్గుళ్ళలోని 35వ పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాయంత్రం ఇద్దరు ఓటర్లు 36వ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడి ఉన్నారు. ఓటే వేసే సమయానికి పోలింగ్ బూత్ ఇది కాదని 35వ పోలింగ్ బూత్‌కు వెళ్ళాలని చెప్పి అనుమతి ఇవ్వమని 36 పోలింగ్ బూత్ బీఎల్‌వో రికమండ్ చేయగా పరుగున బూత్‌కు చేరుకునే సరికి సమయం 6.05 గంటలు కావడంతో 35 బూత్ బీఎల్‌వో ఉమాదేవి అనుమతి నిరాకరించారు. అయితే 35వ బూత్‌లో పోలీసులు నియమించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఓటింగ్ యంత్రాల వద్దకు ఓటర్లను తీసుకెళ్లేందుకు ఏవిధమైన అనుమతులు లేనప్పటికి ఉదయం నుంచి వృద్ధులను తీసుకుని నేరుగా వైసీపీకి ఓటేయించారని బీఎల్‌వో నిలువరించలేదని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం నాయకులు ఆందోళన చేపట్టారు. చాలా సేపు వారిని పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో ఫిర్యాదు ఇవ్వడానికి సిద్ధపడ్డారు.








ఓటేశాం : కూటమి అభ్యర్థులు వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ



ఓటేసిన కాంగ్రెస్ ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు గిడుగు రుద్రరాజు, బోడా వెంకట్



ఆదిరెడ్డి అప్పారావు



కేఎస్ జవహర్



ఓటేసిన వేలు చూపుతున్న పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు

స్ట్రాంగ్ రూమ్‌కు ఓటరు తీర్పు

నన్నయ వర్శిటీ స్ట్రాంగ్ రూమ్‌లలో అభ్యర్థుల జాతకాలు



ఇదిగో ఓటరు తీర్పు : నన్నయ వర్శిటీకి రాత్రి 11 గంటల సమయంలో ఈవీఎంలో తరలివచ్చిన పోలింగ్ సిబ్బంది

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి)/రాజానగరం : జిల్లాలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకూ వరకూ పోలింగ్ సాగింది. రాజానగరం మండలం వెలుగుబంద 167 పోలింగ్ కేంద్రంలో రాత్రి 11.30 గంటలకు పోలింగ్ ముగిసింది. గోపాలపురం మండలం గంగోలు 14వ పోలింగ్ బూత్ వద్ద రాత్రి 11.30 గంటలకు 30 మంది ఓటర్లు క్యూలో ఉన్నారు. నిడదవోలు మండలం సూరాపురం 14వ పోలింగ్ బూత్‌లోనూ రాత్రి వరకూ పోలింగ్ సాగింది. జిల్లాలో మొత్తం 83మంది అభ్యర్థులు పోటీ చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన పోటీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ మధ్యే జరిగింది. కాంగ్రెస్ కూడా కొంతమేర పోటీ ఉన్నట్టు అనిపించింది. పోలింగ్ ప్రశాతంగా ముగిసినట్టే. కానీ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడతాయి.ఆ రోజు ఓట్లు లెక్కిస్తారు. అప్పటి వరకూ ప్రస్తుతం ఓటర్లు వేసిన ఓట్లను తనలో దాచుకున్న ఈవీఎంలను దివాన్‌చెరువులోని ఆదికవి నన్నయ్య వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లలో నిక్షిప్తం చేస్తున్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలతో పాటు లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల భద్రతకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ రాత్రి 10 గంటలకు నన్నయ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఈవీఎంలన్నీ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరేసరికి అర్ధరాత్రి దాటిపోవచ్చు. తెల్లారినా తెల్లవారవచ్చు.ఈ మేరకు 14 స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ వరకూ అవి భద్రతాధికారుల నిఘా కిందే ఉంటాయి.





ముగ్గుళ్లలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు


దుర్గాడలో..


ఐ.పోలవరంలో..


ఆత్రేయపురం మండలం వెలిచేరులో తొలిసారి ఓటు వేసిన యువకులు


రాజమండ్రిలో యువ ఓటరు


రాజమహేంద్రవరంలో ఓటర్ల సందడి


ప్రత్తిపాడు: ధర్మవరంలో కొత్త ఓటర్ల సందడి


తన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దశరథ రామారెడ్డి, ఆయన భార్య సింధు..


రాజమహేంద్రవరంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటోత్సాహం

పండగలా పోలింగ్ డే

మన్యంలో పోలీస్ నీడన పోలింగ్

రంపచోడవరం, మే 13: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మన్యం నియోజకవర్గంలో పోలీసు నీడన సోమవారం నాటి సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మధ్నాహ్నం 4 గంటలకే పోలింగ్‌ను ముగించేశారు. ఎక్కడా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు కానీ, అవాంఛనీయ ఘటనలు కానీ చోటు చేసుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీష్ అడహళ్లి స్పష్టం చేశారు. 11 మండలాలలోని 399 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు మునుపెన్నడూ లేనంతగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేశారు. మొత్తం 70 శాతం వరకూ పోలింగ్ నమోదైంది. మారేడుమిల్లి, వై.రామవరం, చింతూరు, ఎటపాక మండలాలలో మావోయిస్టు ప్రభావిత సరిహద్దు ప్రాంతాలను పోలీసులు పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా వై.రామవరం మండలంలోని గుర్తేడు, పాతకోట, ఇర్లవాడ గ్రామాల్లో నిర్వహించిన ఆరు పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను, సిబ్బందిని వాయుసేనకు చెందిన హెలికాప్టర్ ద్వారా రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్ పరిశరాలలోని మైదానానికి తరలించారు. మధ్నాహ్నం నాలుగు గంటలకే పోలింగ్ సమయం ముగిసిపోయినప్పటికీ అప్పటికే లైన్లో ఉన్న వారందరికీ సాయంత్రం ఐదు గంటలవరకూ పోలింగ్‌కు అనుమతించారు. తెలుగుదేశం అభ్యర్థి మిరియాల శిరీషాదేవి రాజఒమ్మంగి మండలం అనంతగిరిలోనూ, వైసీపీ అభ్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మి అడ్డతీగల మండలం పాపంపేటలోనూ, సీపీఎం అభ్యర్థి లోతా రామారావు రాజఒమ్మంగి మండలంలోనూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


గుర్తేడు పోలింగ్ కేంద్రం వద్ద సాయుధ పోలీసు నిఘా

పవన్‌కు ప్రేమతో ఓటేశారు

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న నాగబాబు

పిఠాపురం, మే 13: అభిమానంతో ఓటు వేయడం వేరు, ఇష్టంతో ఓటు వేయడం వేరు ఈ రెండు కలిపి పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ప్రేమతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఓటు వేశారని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. ఆయన నియోజకవర్గంలో పోలింగ్‌బూత్‌లను సోమవారం సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పిఠాపురం ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో పవన్ బాధ్యతను మరింత పెంచారని నాగబాబు చెప్పారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పవన్‌కల్యాణ్ పేరు ప్రకటించిన నాటి నుంచి నేటి వరకూ అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. జనసేన పార్టీ శ్రేణులతో టీడీపీ, బీజేపీ శ్రేణులు మమేకమైన తీరు మరువలేనిదని చెప్పారు. నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళల శ్రమ వెలకట్టలేదని తెలిపారు. పవన్ పోటీతో పిఠాపురం పార్టీ శ్రేణులపై ఒత్తిడి ఏర్పడిన మాట వాస్తవమని, అయినప్పటికి చిన్న ఇబ్బంది లేకుండా ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడానికి దోహదం చేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. మండల, గ్రామ, పట్టణ, వార్డు స్థాయిలో కమిటీలుగా ఏర్పడి పవన్‌కల్యాణ్ అభ్యర్థిత్వాన్ని బలపరిచేందుకు శ్రమించిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తిస్తామని తెలిపారు.

4 చోట్ల ఈవీఎంల మార్పు

ప్రత్తిపాడు, మే 13: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈవీఎం మిషన్లలో కాకినాడ ఎంపీ జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఫొటోపై స్టాంప్ పడటంతో అతని బొమ్మ అస్పష్టత ఉండటం వల్ల 14 గ్రామాల నుంచి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆర్వో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4 చోట్ల ఈవీఎం మిషన్లలో జనసేన అభ్యర్థిపై స్టాంప్ లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే మండలంలోని శరభవరం, ఒమ్మంగి గ్రామాల్లో కూడా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య స్వల్ప వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం నాటికి 68 శాతం పోలింగ్ నమోదయింది.

పల్లంలో కొట్లాట

ముగ్గురికి తీవ్రగాయాలు



కాట్రేనికోన, మే 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్లంలో అల్లర్లు చెలరేగాయి. వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. టీడీపీ వర్గీయుల ఇంటి వద్ద వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడటంతో ఘర్షణ జరిగి ఇరువర్గాలు రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. మల్లాడి చినధర్మారావు, మల్లాడి నరసింహమూర్తి, మల్లాడి సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అమలాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు రక్షణ ఏర్పాటు చేశారు. బలుసుతిప్పలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య గొడవతో ఉద్రిక్తత నెలకొంది. కుండలేశ్వరంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. వైసీపీకి చెందిన దివ్యాంగుడు కోలా సత్యనారాయణ ఈ సంఘటనలో గాయపడ్డాడు.

వంగా గీతకు చుక్కెదురు


వంగా గీతను అడ్డుకుంటున్న జనసేన కార్యకర్తలు

పిఠాపురం రూరల్, మే 13: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు గ్రామాల్లో చుక్కెదురయింది. పలు చోట్ల గీతను అడ్డుకున్నారు. విరవ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి పరిశీలించేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లిన గీతను లోపలకు వెళ్లకూడదంటూ జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. నినాదాలతో హోరెత్తించారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లనిచ్చేది లేదంటూ అడ్డుతగిలారు. దీనితో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఆమెను లోపలకు పంపారు. కుమారపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన గీతను తమకు డబ్బులు ఇవ్వలేదంటూ ఓటర్లు ప్రశ్నించారు. ఇచ్చామని సర్పంచ్, ఎంపీటీసీలు చెప్పడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. డబ్బులు ఇవ్వకుండా ఇచ్చారని అంటారా అంటూ ఓటర్లు నిలదీశారు. పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. బి.ప్రత్తిపాడులోనూ గీతకు ఇదే పరిస్థితి ఎదురయింది. పోలింగ్ కేంద్రంలోకి రావద్దంటూ నినాదాలు చేశారు.

డబ్బులిస్తేనే ఓట్లు వేస్తాం

గొల్లప్రోలు రూరల్, మే 13: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఓటర్లు వైసీపీ నేతలకు ఝలక్ ఇచ్చారు. కాలనీకి చెందిన ప్రజలను ఓటు వేయడానికి రావాలని ఓటర్లను వైసీపీ నేతలు కోరారు. ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. అయితే డబ్బులు ఇవ్వకుండా వైసీపీ నేతలు ముఖం చాటేశారు. దీనితో ఓటర్లు తాము ఓటు వేసేది లేదంటూ భీష్మించారు. వారికి నచ్చచెప్పేందుకు టీడీపీ,జనసేన నేతలు కోరినా ఫలితం లేకపోయింది.

ఓటు వేసిన అనంతరం..

ఇంటికొచ్చి ఫిట్స్‌తో వ్యక్తి మృతి

మామిడికుదురు, మే 13: ఓటు హక్కు వినియోగించుకున్న వ్యక్తి ఫిట్స్ రావడంతో మృతి చెందాడని బంధువులు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠంలో కర్రి సత్యనారాయణ(52) ఓటు హక్కును వినియోగించుకుని ఇంటికి వెళ్లాడు. ఫిట్స్ రావడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.

రేగులపాడులో

కూనవరం, మే 13: మండలంలోని రేగులపాడులో పైడా పార్వతి(41) ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేసి ఇంటికి తిరిగివచ్చిన కొద్దిసేపటికే మృతిచెందింది. మండలంలో భారీగా ఓటు శాతం నమోదైంది.

చున్నీ మెడకు చుట్టుకుని బాలిక మృతి



మోతుగూడెం, మే13: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో మల్లవరపు పవిత్ర(10) ఉయ్యాల చున్నీ మెడకు చుట్టుకోవడంతో మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు వీరభద్రరావు, దేవి దంపతులు ఓటు వేయడానికి వెళ్లారు. ఇంటి గుమ్మానికి చున్నీతో ఉయ్యాలతో పవిత్ర ఆడుకుంటూ ఊగడంతో ఒక్కసారిగా చున్నీ మెడకి చుట్టుకోవడంతో ఊపిరాడక అలాగే ఉండిపోయింది. కొద్దిసేపటి తర్వాత ఓటేసి తల్లిదండ్రులు ఇంటికి వచ్చే చూసేసరికి పవిత్ర మెడకు చున్నీ వేలాడుతూ చూసి తల్లిదండ్రులు ఆటోలో డొంకరాయి ఏపీజెన్కో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె కండిషన్ సీరియస్‌గా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘బూత్’పై వైసీపీ ప్రతాపం

పలు చోట్ల దౌర్జన్యాలు..కూటమి క్యాడర్‌పై దాడులు


గాయపడ్డ జగడం నరేష్

తాళ్లరేవు, మే 13: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగినప్పటకీ కొన్నిచోట్ల వైసీపీ కార్యకర్తలు ఓటమి భయంతో టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యకర్తలపై దాడులు నిర్వహించారు. కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెంలో పోలింగ్ బూత్ కేంద్రాలు వద్ద వైసీపీ, కూటమి కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. పాతకోరింగలో వైసీపీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పోలేకుర్రు పంచాయతీ తోటపేట పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ కార్యకర్తలు టీడీపీ బీసీ ఓటర్లను అడ్డుకొని దౌర్జన్యం దాడులు చేయడంతో ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. జగడం నరేష్‌కు తీవ్రగాయం కాగా భత్రాజు యేసు, మహాలక్ష్మీ రావు, కడలి గోపి, రెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. సంఘటన స్థలానికి కోరింగ ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో చేరుకుని గ్రూపులను చెదరగొట్టి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి గాయాలు



ఆత్రేయపురం, మే 13: సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోలేని వైసీపీ శ్రేణులు టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడికి పాల్పడ్డారు. సోమవారం ఆత్రేయపురం పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నాయకులు వెళ్లడంతో అడ్డువచ్చిన టీడీపీ మండలాధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజుపై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. చొక్కాను చించి భుజంపై గాయపరిచారు. ఆత్రేయపురంలో టీడీపీకి మంచి మెజార్టీ వస్తుందని దానిని చూసి ఓర్వలేకే తనపై దాడికి పాల్పడ్డాడని వెంకట్రాజు ఆరోపించారు. తనపై ఉద్దేశపూర్వకంగానే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడికి పాల్పడేలా చేశారన్నారు. ఆత్రేయపురం మండలంలో మంచి మెజార్టీ సాధించడం తథ్యమని కూటమి అభ్యర్థి బండారు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. వెంకట్రాజును ఇంటి వద్ద కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పరామర్శించి సంఘటనల వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు.

దొమ్మేరులో ఘర్షణ

కొవ్వూరు, మే 13: కొవ్వూరు మండలం దొమ్మేరులో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దొమ్మేరు జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుని ఘర్షణకు దిగారు. సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు పార్టీల కార్యకర్తలను అక్కడ నుంచి పంపించివేశారు. అదే సమయంలో వచ్చిన పోలీసు ఎన్నికల అబ్జర్వర్ బలరాం మీనా వివరాలు సేకరించారు. పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైసీపీ నాయకుల దాడిలో విరిగిన కాలు

రంగంపేట, మే 13 : మండలంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల దగ్గర బారులుతీరారు. కొన్ని పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రంగంపేట మండలం సుభద్రంపేటలో పోలింగ్ బూత్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గుద్దటి సూరిబాబుపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో కాలు విరిగింది. పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం సూరిబాబును అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మండలంలో వడిశలేరు, బాలవరం, మరికొన్ని గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ రాళ్ల దాడి



అనపర్తి, మే 13: పెదపూడి మండలం గొల్లల మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో పోలింగ్ బూత్ వద్ద సచివాలయ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పోలింగ్ బూత్ వద్ద ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు కార్యదర్శిని నిలదీశారు. ఎటువంటి పోలింగ్ పాసులు లేకుండా పోలింగ్ స్టేషన్‌లో ఉండటంపై కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా బలభద్రపురంలో ఆశావర్కర్ వైసీపీకి ప్రచారం నిర్వహిస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. రంగాపురంలో ముగ్గురు అన్నదమ్ములపై వైసీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఇరువురు సోదరులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

వైసీపీ ఎంపీపీ హల్‌చల్

బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామంలో పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ సరళి పరిశీలించేందుకు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆయనతో పాటుగా నలుగురు వ్యక్తులు ఉండటంతో ఎంపీపీ జ్యోతిర్మయి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో టీడీపీ శ్రేణులు ముందుకు రావడంతో కొద్ది సేపు రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. చివరకు పోలీసులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. రాళ్ల దాడిలో గాయపడిన కార్యకర్తలను ఆస్పత్రిలో నల్లమిల్లి పరామర్శించారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

రాజవొమ్మంగి మే 13: రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగి గ్రామంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఎమ్మెల్యే ధనలక్ష్మితో పాటు ఎక్కువ మంది పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించడంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నేతలు ఎలా వస్తారంటూ టీడీపీ నేతలు వారించడంతో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఏజెన్సీ సమాచారం

పోలింగ్ ప్రశాంతం

- మన్యంలో మొరాయించిన ఈవీఎంలు, ఓట్ల గల్లంతు
- నష్టం చేకూర్చేందుకు చేసిన కుట్రలో భాగమే అంటున్న టీడీపీ
- రంపచోడవరంలో ముగ్గురికి ఛాలెంజ్ ఓట్లు

రంపచోడవరం, మే13: మన్యంలో పలు మండలాల్లో పోలింగ్ ప్రారంభంలోనే పలు చోట్ల ఈవీఎంలు మొరాయించగా, చాలా మంది ఓట్లు ఆయా ప్రాంతాలలో గల్లంతయ్యాయి. కొన్ని చోట్ల మాక్ పోలింగ్ చేస్తుండగానే మొరాయించడంతో ఆయా సెక్టోరల్ అధికారులు వాటి స్థానంలో వేరే ఈవీఎంలు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల పోలింగ్ ప్రారంభం కాగానే మొరాయించాయి. రంపచోడవరం ప్రధాన కేంద్రంలో కూడా ఈ పరిస్థితి ఏర్పడింది. మొరాయించిన కేంద్రాలలో పోలింగ్ అలస్యంగా మొదలైంది. ఇదిలా ఉండగా చాలా మంది ఓట్లు వేయడానికి వచ్చి తమ ఓట్లు లేవని తెలిసి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈవీఎంల మొరాయింపు, ఓట్ల గల్లంతు తమకు నష్టం చేకూర్చేందుకు చేసిన కుట్రలో భాగమేనని తెలుగుదేశం నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా రంపచోడవరంలో ముగ్గురు ఓటర్లకు సంబంధించి ఓట్లు ఎవరో వేసేయడంతో వారికి అధికారులు చాలెంజ్ ఓట్లు ఇచ్చారు.

రంపచోడవరం ప్రధాన కేంద్రంలో తక్కువగా పోలింగ్

రంపచోడవరం డివిజన్ ప్రధాన కేంద్రంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఉదయం జోరుగా సాగిన పోలింగ్ మధ్నాహ్నం అయ్యేసరికి మందకొడిగా మారింది. కారణం తెలియలేదు కానీ రంపచోడవరం కేంద్రంలో ఉన్న అనేకమంది పోలింగ్‌లో పాల్గొనలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం రంపచోడవరం కేంద్రంలో 60 శాతం వరకూ మాత్రమే పోలింగ్ జరిగింది. ప్రధాన కేంద్రంలో 8 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాలలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది.

ఓటు హక్కు వినియోగించుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధనలక్ష్మి



అడ్డతీగల మండలం పాపంపేటలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మి సోమవారం తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. అడ్డతీగల మండలం ఎల్లవరంలో ఎమ్మెల్సీ అనంతబాబు ఓటు హక్కును వినియోగించు కున్నారు.

రంపచోడవరంలో ఓట్లు వేసిన ప్రముఖులు

రంపచోడవరం నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. రంపచోడవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ రాజ్య సభ సభ్యురాలు టి.రత్నాబాయి, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వ రరావు, చిన్నం బాబురమేష్ రంపచోడవరంలో ఓటుహక్కు వినియో గించుకున్నారు.

ఎన్నికల బందోబస్తును పర్యవేక్షించిన అదనపు ఎస్పీ

మన్యంలో ఎన్నికల బందోబస్తును ఎప్పటికప్పుడు రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీష్ అడహళ్లి పర్యవేక్షించారు. రంపచోడవరం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలింగ్ కేంద్రాల పరిస్థితిని కూడా ఆయన ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. గుర్తేడు, పాతకోట ప్రాంతాల నుంచి హెలికాప్టర్ ద్వారా వచ్చే ఈవీఎంలు రంపచోడవరం చేరే వరకూ ఆయన స్వీయ పర్యవేక్షణ చేశారు.

భారీగా ఓటింగ్..

చింతూరు, మే 13: చింతూరు డివిజన్‌లో ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడ కూడా ఎటువంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. డివిజన్‌లో భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. ఓటర్లు పోలింగు కేంద్రాల వద్ద ఉదయం నుంచే బారులు తీరి ఉండడం గమనార్హం. ప్రారంభ సమయంలో పలు కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగు నెమ్మదిగా జరిగింది. దీంతో సాయంత్రం నాలుగు గంటలకు ముగియాల్సిన పోలింగ్ సాయంత్రం ఐదు గంటల వరకు క్యూలో ఉన్నవారికి అవకాశం కల్పించారు. ఈ క్రమంలో చింతూరులో 76.08 శాతం, కూనవరంలో 81.50, వీఆర్ పురంలో 81.40, ఎటపాకలో 76.51 శాతం ఓటింగ్ నమోదైంది.

మోతుగూడెంలో భారీగా ఓటింగ్ నమోదు

మోతుగూడెం, మే13: చింతూరు మండలం మోతుగూడెంలో 2600 ఓట్లకు గాను 1768 ఓట్లు పోలయ్యాయి. 68 శాతం నమోదయింది. చదలవాడలో 451 ఓట్లకు గాను 336 ఓట్లు పోలయ్యాయి. గూడూరు పంచాయతీ పరిధిలో 1304 ఓట్లకు గాను 1045 ఓట్లు పోలయ్యాయి. కొత్తపల్లి 638 ఓట్లకు గాను 509 ఓట్లు పోలయ్యాయి.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి తప్పని పాట్లు



రాజవొమ్మంగి, మే 13: రంపచోడవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాదేవి అనంతగిరి గ్రామంలో సోమవారం తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్‌తో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే వారు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రయత్నించినా ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యం అయినట్లు శిరీషాదేవి తెలిపారు.

పోలింగ్ ప్రశాంతం

దేవీపట్నం, మే13: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 29 బూత్‌లలో సోమవారం జరిగినన ఎన్నికల్లో సాయంత్రం 5గంటల సమయానికి 62 శాతం నమోదైంది. ఉదయం ఈవీఎంలు సుమారు గంట సేపు మొరాయించాయి. అనంతరం ఓటింగ్ శాతం నెమ్మదిగా పుంజుకుంది. ఎక్కడా ఎటువంటి ఘర్షణలు లేకుండా సజావుగా జరిగింది. ఓటర్లకు అన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ కొన్ని చోట్ల మాత్రం ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల ఎండలోనే నిలుచుని ఓట్లు వేశారు.

కూనవరం, మే 13: చిన్నచిన్న ఘర్షణల మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి ఓటర్లు పోటెత్తారు. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించాయి. మండల కేంద్రమైన కూనవరంలో జనసేన, టీడీపీ కూటమికి, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. జనసేనకు చెందిన కొంత మంది యువకులు వలంటీర్లగా ఎన్నికల బూత్‌ల్లోకి చొరబడుతున్నారని వైసీపీ నాయకులు ఆరోపణలు చేయగా ఇరుపార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు వచ్చి వారిని చెల్లాచెదురు చేసి ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు.

ఈవీఎంల మొరాయింపు

వై.రామవరం, మే13: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. కొన్నిచోట్ల గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా ఓటు ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో 22,269 మంది ఓటర్లకు చింతలపూడి పంచాయతీ మినహా 13,714 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలైన గుర్తేడు, పాతకోట, బొడ్డగండి గ్రామాల్లోని ఈవీఎంలను హెలికాప్టర్ ద్వారా రంపచోడవరం తరలించారు.

వీఆర్‌పురంలో 81.40 శాతం పోలింగ్

వరరామచంద్రాపురం, మే 13: మండలంలో 81.40 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ తెలిపారు. 19,953మంది ఓటర్లకుగాను 16,241 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించి, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీఆర్‌పురం పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఎక్కువగా వికలాంగులు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మండలంలో 76.51 శాతం పోలింగ్

ఎటపాక, మే 13: అసెంబ్లీ, పార్లమెంట్‌కు సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. అయితే పోలింగ్ ప్రారంభం నుంచి ఈవీఎం మిషన్లు మొరాయించడంతో పలు చోట్ల పోలింగ్ గంట నుంచి 2 గంటల ఆలస్యంగా మొదలైంది. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఓటర్లు క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు చోట్ల పోలింగ్ కేంద్రాల రన్నర్స్‌గా వలంటీర్లను నియమించడంతో కూటమి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఓటర్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఓటు వేసే సమయంలో గందరగోళానికి గురయ్యారు. గన్నేరుకొయ్యపాడు గ్రామంలో గ్రామ సమస్యలు పరిష్కరించలేదని గ్రామస్తులు ఏకతాటిపై నోటాకు ఓటు వేసినట్లు చెప్పారు. పలు కేంద్రాల వద్ద టెంట్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు చెట్ల కింద సేదతీరాల్సిన పరిస్థితి నెలకొంది. కన్నాయిగూడెం, చోడవరం, పినపల్లి అనేక గ్రామాల్లో పోలింగ్ 7-30 వరకు సాగింది. కాగా మండలంలో మొత్తం 76.15శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలతో పోల్చితే ఈఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది.

ఓటుకు పోటెత్తారు



రాజమహేంద్రవరంలో క్యూలో నిలబడిన ఓటర్లు

- ప్రశాంతంగా పోలింగ్
- మండుటెండలో క్యూలైన్లలో ఓటర్ల బారులు
- మందకొడిగా ఈవీఎంల పనితీరు
- బీప్ శబ్దంతో జాప్యం
- సౌకర్యాల ఏర్పాటులో అధికారుల వైఫల్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 2024కు రాజమహేంద్రవరంలో మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోటెత్తారు. రాజమహేంద్రవరంలోని 237పోలింగ్ కేంద్రాలలో ఉదయం 6:00గంటలకు మాక్ పోలింగ్ జరిగింది. అటుపై ఉదయం 6:30 నుంచి ప్రజలు క్యూకట్టారు. 7గంటల నుంచి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగరంలో ప్రజలు పెద్దఎత్తున పోలింగ్‌స్టేషన్లకు చేరుకున్నారు. ఉద యం 9గంటల వరకు వాతావరణం చల్లగా ఉండడంతో ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది. అటుపై ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినా గంటల తరబడి క్యూలో నిలబడి ఓపికతో ఓటు హక్కును వినియోగించుకుని రావడం కనిపించింది. వృద్ధులు, మహిళలు, ఉదయాన్నే ఓటు హక్కును ఎక్కువ శాతం వినియోగించుకున్నారు. యువకులు మధ్యాహ్నం ఓట్లువేశారు. ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ స్టేషన్లు ఓటర్లతో కళకళ్లాడాయి.

● పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు లేవు

రాజమహేంద్రవరంలో పోలింగ్ స్టేషన్లలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేవలం 20 మంది మాత్రమే పట్టే విధంగా టెంట్‌లను ఏర్పాటు చేయడంతో వందలాది మంది క్యూలో ఎండలో నిలబడ్డారు. అదేవిధంగా తాగడానికి తాగునీరు కూడా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ స్టేషన్లలో లోపల ఇరుగ్గా ఉండడంతో తిరిగి జనాల మధ్యలోంచే రావడం వల్లన తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పోలింగ్‌స్టేషన్లు పక్కపక్కనే ఉండడంతో నెంబర్లు అయోమయానికి గురై ఒక్క పోలింగ్ బూత్ ఓటర్లు మరొక పోలింగ్ బూత్‌కు నిలబడి చివరి వరకు వెళ్లేసరికి సరిచూసుకుని మళ్లీ వెనక్కివెళ్లి నిలబడిన సంఘటనలు జరిగాయి. ఆయా కేంద్రాల్లో సిబ్బంది పెద్దగా పట్టించుకోకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. అయినా వాటన్నింటినీ తట్టుకుని ఓట్లు వేశారు.

● నత్తనడకన పోలింగ్

ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ చాలా మందకొడిగా నత్తనడకన సాగింది. ప్రజలు ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పోలింగ్ స్టేషన్లకు చేరుకోవడంతో ఓటు వేయడానికి గంట నుంచి రెండు గంటలపాటు వెయిట్ చేయాల్సి వచ్చింది. దీంతో ఓటర్లు తిట్టుకున్నారు. కానీ ఓటు వేసే వెళ్లారు. కొన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదేశం ఖాళీగా ఉండటంతో అక్కడ పోలింగ్ ప్రశాంతంగా సాగింది. శేషయ్యమెట్ట కల్యాణ మండపంలోను, చందాసత్రంలోను, ఉమా రామలింగేశ్వరా కళ్యాణ మండపంలోను పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మిగిలిన చోట్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

● పోలింగ్ సరళి

ఉదయం 7నుంచి 9గంటల వరకు నగరంలో 327 పోలింగ్ స్టేషన్లలో 22వేల 963 ఓట్లు పోలై 8.58శాతం నమోదైంది. అదేవిధంగా ఉదయం 9నుంచి 11గంటల మధ్య 56వేల 903 ఓట్లు పోలై 21.27 శాతం నమోదైంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట మధ్య 85వేల 363 ఓట్లు పోలై 31.91 శాతం నమోదైంది. మధ్యాహ్నం 1 నుంచి 3గంటల మధ్య లక్షా 26వేల 71 ఓట్లు పోలై 47.13 శాతం నమోదైంది. మధ్యాహ్నం 3నుంచి సాయంత్ర 5గంటల మధ్య లక్షా 55వేల 664 ఓట్లు పోలై 58.20 శాతం నమోదైంది. సాయంత్రం 5 నుంచి ముగింపు సమయం 6గంటలకు క్యూలో నిలబడి ఉన్న ఓటర్లందరికీ పోలింగ్ స్టేషన్‌లోకి అనుమతించి ఓటు హక్కు వినియోగించే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. సాయంత్రం 6గంటలు దాటక పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్నవారిని అనుమతించలేదు. 6గంటలకు క్యూలో ఉన్నవారి 6 నుంచి 9 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో ఒక లక్షా 76వేల 419 ఓట్లు పోలై 65.95 శాతం నమోదైంది. అనంతరం 9 నుంచి రాత్రి 11.10 నిమిషాల వరకు ఒక లక్షా 78వేల 456 ఓట్లు పోలై 66.72 శాతంగా నమోదైంది.

● మార్పుకోరుకుంటున్న ప్రజలు

రాజమహేంద్రవరంలో పోలింగ్ స్టేషన్లకు వచ్చిన ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత రాష్ట్రంలో పాలన మారాలని అనుకోవడం కనిపించింది. కొంతమంది బహిర్గతంగానే అన్నారు. ఓటరు చైతన్యవంతమయ్యాడని మార్పు మొదలైందని సగటు ఓటరు అన్నాడు. అదేవిధంగా చాలా బాధ్యతగా ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవడం కూడా పెద్దమార్పేఅని చెప్పాలి. గతంలో పోలిస్తే ఓటు పట్ల చాలా శ్రద్ధ ప్రజల్లో కనిపించింది. ఇది మార్పునకు నాందికావొచ్చు .

ఓటు హక్కును వినియోగించుకున్న నేతలు

రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ,జనసేన నేతలు తమతమ ఓటు హక్కులను వినియోగించుకున్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, స్థానిక 8వ డివిజన్‌లో జనసేన నగర ఇంచార్జి అత్తి సత్యనారాయణ, స్థానిక 50వ డివిజన్ తోలత్ మెమోరియల్ స్కూల్‌లోను తమతమ ఓటు హక్కును వినియోగించారు. ప్రజలే తమ ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించబోతున్నారని వారు చెప్పారు. అనుశ్రీ సత్యనారాయణ నగరంలో 13,14,15, 9,50, 42,47,6,25 డివిజన్లలో పోలింగ్‌స్టేషన్లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షణ

రాజానగరం/దివాన్‌చెరువు, మే 13 : రాజానగరం నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ స్వల్ప సంఘటనలు మినహా పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు పోలింగ్ సమయం కంటే ముందుగానే తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. ఓటు వేసేందుకు మండుటెండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించారు. పోలింగ్ ముగిసే సమయానికి నియోజకవర్గంలో దాదాపు 50 కేంద్రాలకు పైబడి ఓటు వేసేందుకు ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటలకు ముందు క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు ఆయా కేంద్రాల పీవోలు స్లిప్‌లు అందజేశారు. ఉన్నప్పటికి అనేక కేంద్రాల్లో మహిళా, పురుష ఓటర్లకు ఒకే పోలింగ్ కేంద్రం కేటాయించడం, బీప్ శబ్దం వచ్చే వరకు ఓటరు పోలింగ్ బూత్‌లో వేచి ఉండటం, కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు ఏర్పాటుచేసిన కంపార్టుమెంటుల్లో వెలుతురు తక్కువగా ఉండటం వంటి సంఘటనలతో పోలింగ్‌జాప్యం కావడానికి కారణాలుగా చెప్పొచ్చు. తమ ఉద్యోగాలకు రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ కార్యకర్తలు ప్రచారం చేస్తూ స్వామి భక్తిని చా టుకున్నారు. రాజానగరం మండలం నరేంద్రపురంలోని హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ప్రగడ పార్వతి అనే 93 ఏళ్ల వృద్ధురాలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ

ఓటు వేయడానికి నరకయాతన

- సిద్ధార్థనగర్ స్కూల్‌లో మందకొడి పోలింగ్
- పోలింగ్ బూత్‌ల్లోకి యథేచ్ఛగా సెల్‌ఫోన్లు

రాజమహేంద్రవరం అర్బన్, మే 13: రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ ఏరియాలోని అనేక పోలింగ్ బూత్‌ల్లో ప్రశాంతంగా ఓటు వేయడానికి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక కారణాలు చూపుతూ బూత్‌ల్లోని పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయలేకపోవడంతో ఓటర్లకు అవస్థలు తప్పలేదు. పోలీస్ బందోబస్తు అంతంతమాత్రంగానే ఉండడంతో ఓటర్లను నియంత్రించే అవకాశం లేకుండాపోయింది. కొన్ని బూత్‌ల్లో ఓటర్లు ఓటు వేయడానికి తోపులాడుకోవాల్సి వచ్చింది. దీనికితోడు పోలింగ్ బూత్‌లవద్ద పూర్తిస్థాయిలో మంచినీటి సౌకర్యం అరకొరగా ఏర్పాటు చేయడం, క్యూలైన్లలోని వారికి ఫ్యాన్లు లేకపోవడంతో ఎండవేడిమి, ఉక్కపోతతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రధానంగా సిద్ధార్థనగర్ మున్సిపల్ స్కూల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. బూత్ నెం.24లో ఓటు వేయడానికి ఓటర్లు గంటల సమయం వేచి చూడాల్సి వచ్చింది. ఇక్కడే ఉన్న మరికొన్ని బూత్‌ల్లోనూ ఇలాంటి పరిస్థితులు కనిపించాయి. క్యూలైన్లు సక్రమంగా నిర్వర్తించలేదు. పోలీస్ తనిఖీలు లేకపోవడంతో అనేక మంది ఓటర్లు సెల్‌ఫోన్లను దర్జాగా బూత్‌ల్లోకి తీసుకెళ్లిపోవడం గమనార్హం. క్యూ లైన్లలో సెల్ఫీలు తీసుకోవడం విశేషం.



అనపర్తిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన వైసీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు..

ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు నిలిచినప్పటికి ప్రధాన పార్టీలైన కూటమి, వైసీపీ అభ్యర్థుల విజయావకాశాల పైనే ప్రజలు ఆసక్తి కనబర్చారు. ఎన్నికల్లో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ తమ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కోరుకొండ మండలం గాదరాడ పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాజానగరం మండలం సూర్యారావుపేటలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముంద్రు వెంకట శ్రీనివాస్(పెదబాబు) తన స్వగ్రామమైన కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనపర్తి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి యల్లా శ్రీనివాసరావు సూర్యారావుపేటలో ఓటు వేశారు.

అనపర్తిలో పోలింగ్ ప్రశాంతం

అనపర్తి మే 13: అనపర్తి నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ కొద్దిపాటి చెదురుమదురు సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అనపర్తిలోని 228 పోలింగ్ కేంద్రాలలో ఉదయం నిర్వహిం చిన మాక్ పోలింగ్‌లో కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు కొద్దిసేపు ఆటంకం కలిగింది. రామవరంలో ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనపర్తి బాలి కోన్నత పాఠశాలలో వైసీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకోగా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసవడయార్ తన తండ్రితో కలిసి ఓటుహక్కును విని యోగించుకున్నారు. సాయంత్రం ఆరుగంటలకు పోలింగ్ ముగిసే సమయానికి అనేక కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. రాత్రి తొమ్మిది గంటలకు 80.90 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ ంలో పలుచోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి అదేవిధంగా కొన్ని చోట్ల ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది అధికార పార్టీకి పోలింగ్ బూత్‌ల వద్దే ప్రచారం చేయడంతో టీడీపీ బీజేపీ జనసేన కార్యకర్తలు అడ్డుకోవడంతో వాగ్వివాదాలు జరిగాయి



కడియంలో గోరంట్లను పూలమాలతో సత్కరిస్తున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నాని, తదితరులు

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మొత్తం 36 బూత్‌లలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 128వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మిషన్ మొరాయించడంతో గంటకుపైగా పోలింగ్ ఆలస్యమైంది.

119వ బూత్ వద్ద స్వల్ప ఉద్రిక్తత

స్థానిక కొత్తపేటలోని ఎంపీపీ స్కూల్‌వద్ద వైసీపీ నాయకులు అతని సోదరుడు కలిసి టీడీపీ నాయకుడు నాళ్ళ రమేష్ అతని భార్యపై దాడి చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు వాసిరెడ్డి రాంబాబు నాళ్ళ రమేష్‌ను పరామర్శించి తగుచర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. బాధితుడు రమేష్ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు

ఓటేసిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల

కడియం, మే 13: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన సతీమణి ఝాన్సీలక్ష్మిలు సోమవారం జరిగిన ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ రౌండుపార్కు వద్ద ఉన్న పాఠశాలలో వారి ఓటును వేశారు. కడియంలో ఆపార్టీ శ్రేణులను కలిసారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు గోరంట్లకు పూలమాల వేసి సత్కరించారు. రాబోయేది కూటమి ప్రభుత్వం అన్నారు. అలానే మండలంలో ఎంపీపీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి ప్రసాద్, కడియపులంకలో టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, పాలెంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అన్నందేవుల చంటిలు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. కడియంలో మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. హైదరబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ఉద్యోగులు, సాఫ్టవేర్ ఉద్యోగులు వారి ఊర్లలో ఓటు వేసేందుకు తరలివచ్చారు.

ఓటు మా హక్కు

ఓటు మా హక్కు... ఓటు హక్కు వినియోగించుకోవడం మా విధి అంటూ మండలంలో పలువురు ఓటు హక్కును వినియోగించుకుని ఆయా గ్రామాల పోలింగ్‌కేంద్రాల్లో ఓటు వేశారు. కడియపులంక గ్రామ మాజీ సర్పంచ్ 92 ఏళ్ల వయస్సు ఉన్న పుల్లా మాణిక్యంను ఓటు వేసేందుకు తమ కుమారుడు పుల్లా రామారావు కడియపులంక ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రానికి తీసుకు వచ్చి ఓటు వేయించారు., ఉదయం 10గంటల ముందు, మధ్యాహ్నం 3 గంటల తరువాత వారి వారి కుటుంసభ్యులు ఓటును వేసేందుకు తీసుకువచ్చారు.

రూరల్‌లో రాత్రి 9 గంటలకు 72.52 శాతం పోలింగ్

కడియం/రాజమహేంద్రవరంరూరల్, మే 13: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో పోలింగ్ కొనసాగుతుంది. 2,72,826 మంది ఓటర్లు ఉండగా, 9 గంటల సమయానికి 26,764 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 9.81 శాతం, 11 గంటల సమయానికి ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు 68,590 మందికి చేరడంతో 25.14 శాతం, మధ్యాహ్నం 1 గంట సమయానికి ఓటు వేసిన వారి సంఖ్య 1,06,623 మంది చేరడంతో 37.25 శాతం, 3 గంటలకు ఓటు వేసిన వారు సంఖ్య 1,45,677 మంది కావడంతో 53.40 శాతం, 5 గంటలకు 1,77,981 మంది ఓటు వేయడంతో 65.24 శాతం, 6 గంటలకు ఓటు వినియోగించుకున్న వారి సంఖ్య 1,97,840 మందికి చేరుకోవంతో ఓటింగ్ శాతం 72.52 గా నమోదు అయ్యింది. ఓటింగ్ ఇంకా కొనసాగుతుంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం అయింది.

● కృష్ణునిపాలెంలో రాళ్ళు రువ్వుకున్న వైసీపీ, టీడీపీ కార్యకర్తలు

గోకవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గోకవరం మండలం లో సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రెండు, మూడు గ్రామాలలో చిన్నపాటి ఘర్షణలు మినహా మిగిలిన అన్ని గ్రామాలలో ప్రశాంత వాతావరణం మధ్య ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. కృష్ణునిపాలెం గ్రామంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్త ల పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడడంతో అక్కడ వారి ఇరువురు మధ్య గొడవ జరిగి రెండు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకునే వరకు పరిస్థితి వెళ్లింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి వివాదాన్ని సద్దుమణిగింపజేశారు. అచ్చుతాపురం, గోకవరం, రంపయర్రంపాలెం, కృష్ణునిపాలెం, తదితర గ్రామాలలో రాత్రి 8.30 గంటల వరకు ఓటర్లు క్యూలైన్లోనే నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అచ్చుతాపురంలో పలుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కూడా ఏర్పడడంతో పోలింగ్ ఆలస్యంగా పూర్తయింది. కాగా అచ్చుతాపురం, గుమ్మళ్ళదొడ్డి, వెదురుపాక, గోకవరం, పెంటపల్లి, తదితర గ్రామాలలో పోలింగ్ సరళిని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలించారు.

కాతేరులో మొరాయించిన ఈవీఎం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని కాతేరు గ్రామంలో జడ్పీ హైస్కూల్ పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 9గంటల సమయంలో ఈవీఎం మొరాయించింది. దీంతో అర్ధగంటపాటు పోలింగ్ ఆగింది. అటుపై ఈవీఎం రిపేరు చేసి పునరుద్ధరించారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

రంగంపేట: రాష్ట్రంలో నాల్గవ విడతలో జరిగిన ఎన్నికల్లో భాగంగా అనపర్తి నియోజకవర్గం రంగంపేట మండలంలో సోమవారం పోలిం గ్ చెదురుమెదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. మండలంలో పురుషుల ఓట్లు 24030, మహిళల ఓట్లు 24151 ట్రాన్స్ జెండర్ ఓటు ఒకటి ఉండగా మొత్తం 48182 ఓట్లు ఉన్నాయి. సోమవారం జరిగిన సాధారణ ఎన్నికలకు ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరారు. కొన్ని గ్రామాల్లో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండు, మూడు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పావుగంటపాటు పోలింగ్‌కు ఆటంకం కలిగింది.



కడియంలో ఓటు వేసిన మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు



సూర్యారావుపేటలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన ఎమ్మెల్యే రాజా



రంగంపేటలో ఉదయం 7గంటలకు బారులు తీరిన ఓటర్లు





రాజానగరంలో ఓటేసిన వృద్ధురాలు



కడియపులంకలో వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న దృశ్యం



కడియం పోలింగ్ బూత్‌లో ఓటర్లు




రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు



వేమగిరిలో మొదటి సారి ఓటు వేసిన యువతులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 14 మే 2024 5







ఎండను లెక్కచేయక..

ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక అపూర్వ ఘట్టం. ఇంకా చెప్పాలంటే కనీవినీ ఎరుగని చరిత్ర. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు వరదలా పోటెత్తారు. ఉదయం ఏడు గంటలకు మొదలైన పోలింగ్.. అర్ధరాత్రి 12 గంటల వరకు సాగుతూనే ఉంది. ఎండ మండిపోతున్నా, కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించినా గంటల తరబడి క్యూలైన్లలోనే నిలబడి మరీ చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఓట్ల శాతం నమోదైంది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆల్‌టైమ్ రికార్డుగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకోవడం గమనార్హం. ఓటర్లలో ఇంత చైతన్యం ఎప్పుడూ చూడలేదని పలువురు చెబుతున్నారు. వాస్తవానికి సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉండగా అర్ధరాత్రి 12 దాటాక కూడా పోలింగ్ జరగడం, విద్యుత్‌కాంతుల మధ్య ఈ ప్రక్రియ కొనసాగడం చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. అంతిమంగా ఈ పోటెత్తిన ఓట్ల వరద ఎవరికి కలిసొస్తుందో, ఎవరిని ముంచుతుందో జూన్ 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే...!?



గోకవరంలో..



రాజమండ్రిలో భారీగా క్యూ

ఓటెత్తారు!

తూర్పున 79.43 శాతం

- రాత్రి 12 గంటల వరకూ పోలింగ్
- ఓటేయడానికి కదిలొచ్చిన జనం
- భారీగా పెరిగిన క్యూలు
- పెరిగిన పోలింగ్ శాతం
- రాజానగరంలో 86.16
- రాజమండ్రిలో 66.72 శాతమే
- అక్కడక్కడా స్వల్పఘటనలు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జనం ఓటెత్తారు.. గతంలో ఎన్నడూ లేనంతగా క్యూకట్టారు.తెలంగాణ, బెంగళూరు, చెన్నై, వంటి ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి ఓటర్లు వరదగా గోదావరికి పోటెత్తారు. కొంత మంది కుర్రాళ్లు పుట్టుకతో వృద్ధులు అన్నట్టు కొందరు ఓటర్లు ఇంకా వాస్తవాలను అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు.వాళ్ల సంఖ్య తక్కువే. ఆలోచనాపరులదే పైచేయిగా అంచనా ఉంది. సాధారణంగా ఎన్నికలంటే విద్యావంతులు, మధ్య, ఉన్నతవర్గాల మహిళలు ఎక్కువగా రారు.ఈ సారి అందరూ ఓటెత్తడం గమనార్హం.ఉదయం 7గంటల నుంచి పోలింగ్ మొదలైంది.హోటళ్లు ఒకటో రెండో మాత్రమే తెరవడం వల్ల ఇబ్బంది కలిగినా, ఓటర్లు నీరసపడలేదు.ఎండను లెక్కచేయలేదు. మధ్యాహ్నం ఒంటి గంటకు క్యూలే ఉన్నాయి. రాత్రి 9 గంటలకు జిల్లాలో 76.8 శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 5 గంటలకే జిల్లాలో 66.55 శాతం ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకే ఓటు హక్కు విని యోగానికి అవకాశం ఉండేది. ఈ సారి మరో గంట పెంచి ఆరు గంటల వరకూ గడువిచ్చినా సమయం సరిపోలేదు. దీంతో 6 గంటలకే పోలింగ్ బూత్‌లకు చేరుకున్న ఓటర్లందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించినట్టు జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. జిల్లాలో 1557 పోలింగ్ బూత్‌లు ఉండగా రాత్రి 7.30 గంటలకు కేవలం 470 బూత్‌లలో పోలింగ్ పూర్తయింది. మిగతా 1107 బూత్‌లలో రాత్రి 9 గంటల తర్వాత పోలింగ్ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో పోలింగ్ శాతం ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జిల్లా సగటు పోలింగ్ శాతం 81.53 శాతంగా ఉంది. ఈసారి దీనిని దాటి పోతున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా రాత్రి 9 గంటలకు 12,46,557 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 76.8 శాతం. పురుషులు జిల్లాలో మొత్తం 7,92,317 మంది ఉండగా 6,09,979 మంది ఓటేశారు.ఇది 76.99 శాతం.మహిళలుజిల్లాలో మొత్తం 8,30,735 మంది ఉండగా 6,36,517 మంది ఓటు వేశారు. ఇది 76.62 శాతం. ట్రాన్స్‌జెండర్లు 97 ఉండగా 61 మంది ఓటేశారు.ఇది 62.89 శాతం. రాజ మహేంద్రవరం లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్ బూత్ వద్ద వైసీపీ ప్రచారం చేస్తుంటే యువకులు తిరగబడడం గమనార్హం. వైసీపీకి వేయమని కొందరు చెబుతుండగా ఎందుకు వేయాలని ప్రశ్నించారు. నిడదవోలు ఎమ్మెల్యేవైసీపీ అభ్యర్థి జి.శ్రీని వాసనాయుడు కాటకూటేశ్వరంలో బూత్ వద్ద ప్రచారం చేస్తుంటే ఓటర్లు తిరగబడడం గమనార్హం. ఇక్కడ ఎందుకు ప్రచారం చేస్తున్నారని గొడవ చేయడంతో టీడీపీ వర్గాలు అక్కడకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే పోలీసులకు ఫోన్ చేయడంతో వారొచ్చి అందరినీ చెదరగొట్టారు. ఎమ్మెల్యే చక్కగా జారుకున్నారు. నిడదవోలు టౌన్‌లో ఐదు గంటల సమయంలో మళ్లీ ఎమ్మెల్యే బూత్‌లో వెళ్లడానికి ప్రయత్నించగా అక్కడ ఎస్ఐ వద్దని చెప్పారు. అయినా వినకుండా వెళ్లడంతో అక్కడ ఉన్న ఏబీఎన్ రిపోర్టర్ సెల్‌లో విజువల్స్ తీయడం చూసిన ఎమ్మెల్యే ఆగ్రహంగా వచ్చి సెల్‌ఫోన్ తీసుకుని, అందులో విజువల్స్ డిలీట్ చేయడం వివాదాస్పదమైంది. వైసీపీ నేతలు కొందరు ఉద్యో గులపై తప్పుడు ఫిర్యాదులు చేసి ఇరికించడం గమనార్హం. నల్లజర్లలో ఓ అంగన్‌వాడీ ఓ మూగ వ్యక్తిని తీసుకుని వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయించిందని ఆరోపిస్తూ ఆమెపై ఫిర్యాదు చేశారు. అదే మండలంలో ఓ మహిళా టీచర్ టీడీపీకి ఐదు ఓట్లు వేయించారని ఆరోపిస్తూ ఆమెపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం వివాదంగా మారింది. అనపర్తి నియోజకవర్గం రంగాపురంలో టీడీపీ సానుభూతి పరులైన మహిళలపై వైసీపీ మూకలు రాళ్లు విసరడంతో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. అంతకుమించి ఈసారి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టే చెప్పవచ్చు. పోలింగ్ సరళిని చూసి వైసీపీ నాయకుల ముఖాలు బేలగా మారి పోయాయి. దీంతో లాలా చెరువు స్కూల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద వైసీపీ నాయకులు మధ్యాహ్నం తర్వాత డబ్బుల పంపిణీకి తెరతీశారు. ఓటరు స్లిప్పులతో సంబంధం లేకుండా చేతిలో రూ.500 నోట్లు పట్టుకుని ఓటర్లకు చాలా గుట్టుగా ముట్టజెప్పారు. ఒక్కో ఓటరుకు రూ.500 నోటును చేతిలో పెట్టారు.

ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరం వరకూ వాహనాలు నిలపకూడదు. గుంపులుగా జనం ఉండకూడదు. వైసీపీ ఈ నిబంధనను యథేచ్ఛగా ఉల్లంఘించింది.చున్నీలాల్ జాజు స్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషను గేటుకు కేవలం రెండు మీటర్ల దూరంలో వైసీపీ నాయకులకు చెందిన కారుని పార్క్ చేశారు. పైగా ఆ కారుకు నంబరు కూడా లేదు.పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టిం గ్‌పై టీడీపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదే పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. ఓటర్లు స్వచ్ఛందంగా తరలిరావడం, పోలీసులు పక్కాబం దోబస్తు ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో పోలీసులు పెద్ద ఎత్తున పహరా కాశారు.





రాజమండ్రి, కొవ్వూరులో క్యూ



కుటుంబీకులతో కలిసి ఓటేసినట్టు చూపుతున్న కలెక్టర్ మాధవీలత



ఓటేశారు : కుటుంబంతో ఓటేసి వస్తున్న అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి



యువత ఓటు పడింది : తొలి ఓటు వేసి ఆనందంగా వేలు చూపుతున్న యువతరం



ఓటు వేయించడానికి తీసుకొచ్చారిలా..

అర్ధరాత్రి 12 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అనపర్తి	2,26,053	1,89,398	83.78
గోపాలపురం	2,42,763	2,06,594	85.10
కొవ్వూరు	1,84,136	1,57,795	85.69
నిడదవోలు	2,13,396	1,71,377	80.31
రాజమండ్రి సిటీ	2,67,484	1,78,456	66.72
రాజమండ్రిరూరల్	2,72,826	1,99,145	72.99
రాజానగరం	2,16,491	1,86,533	86.16
తూర్పుగోదావరి	16,23,149	12,89,298	79.43



ఓటేసిన జేసీ



ఆదిరెడ్డి వాసు, భవానీ దంపతులు



కుటుంబంతో గోరంట్ల





మేమూ ఓటేశాం : రాజమహేంద్రవరంలో ఓటేశామని వేలు చూపుతున్న మహిళలు

రాత్రి 9 గంటలైనా ఆగలేదు : రాజమహేంద్రవరంలో సాగుతున్న పోలింగ్

మార్పు కనిపిస్తోంది..

కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 13 : ప్రజల్లో మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోందని రాజమహేంద్రవరం సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఏకేసీ కాలేజీ పోలింగ్ బూత్‌లో సోమవారం ఉదయం ఆయన తన భార్య ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తల్లి ఆదిరెడ్డి వీర్రాఘవమ్మ, సోదరి అపర్ణలతో కలిసి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో మార్పు అనివార్యమన్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వ విధానానికి చెంపపెట్టుగా ఈ ఎన్నికలు జరిగాయన్నారు. అధికారుల అలసత్వం కూడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సౌకర్యాలు సక్రమంగా లేవన్నారు. ప్రజలు ఇబ్బందులను ఆర్వో దృష్టికి తీసుకువెళ్ళామని చెప్పారు.

జడ్పీ వైస్ చైర్మన్‌కి బూత్ ఏజెంట్ పాస్

తాళ్ళపూడి, మే 13 : తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటలో జడ్పీ వైస్ చైర్మన్‌కి బూత్ ఏజెంట్ పాస్ అధికారులు మంజూరు చేయడంతో టీడీపీ వర్గీయులు కొవ్వూరు ఆర్వోకి ఫిర్యాదు చేశారు. బూత్ ఏజెంటు పాస్ తీసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంపై టీడీపీ నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి అభ్యంతరం తెలపగా వివాదం జరిగింది. దీంతో ఆర్వో ఆమెకు ఇచ్చిన పాస్ రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

అల్లాడిన ఓటర్లు

నిడదవోలు, మే 13 : ఓటర్లు ఎండలో అల్లాడిపోయారు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోనూ చాలా చోట్ల టెంట్‌లు వేయకపోవ డంతో ఓటర్లు ఎండలోనే క్యూకట్టారు. ఎండ మండిపోవడంతో అల్లాడిపోయారు. నిడదవోలు పట్టణంలోని టక్కరిబాబా పేటలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు తూతూ మంత్రంగా ఒక టెంట్ వేసి వదిలేయడంతో ఓటర్లంతా అవస్థలు పడ్డారు. ఓటర్లు ఎండలో విసుగెత్తిపోతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవ డంతో ఎన్నికల ఏర్పాట్లపై బహిరంగంగా ప్రజలు విమర్శించారు. ఒకవైపు ఎండ, మరోవైపు కనీసం తాగునీరు అందుబాటులో లేకపోవడంతో జనం అల్లాడిపోయారు. ఓ గంటపాటు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి మమ అనిపించారు. క్యూలైన్లు భారీగా ఉండడంతో ఓ దశలో హెల్ప్‌డెస్క్ సిబ్బంది మిన్నకుండిపోయారు. పోలింగ్ స్టేషనులోకి వచ్చిన ఓటరుకు బూత్ నెంబరు చెప్పడానికి సిబ్బంది లేరు. దీంతో వృద్ధులు, పసివాళ్లతో వచ్చిన మహిళలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణంగా కనిపించింది. వారిని వీల్‌ఛైర్‌లో బూత్ లోపలికి తీసుకెళ్లే సహాయకులూ తగు సంఖ్యలో లేరు. మధ్యాహ్నం నుంచి ఉన్న కొద్దిపాటి మంది కనుమరుగయ్యారు. దీంతో ఆటో డ్రైవర్లు, తమ కూడా వచ్చిన వారి సహాయంతో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మెడికల్ డెస్కులు పెట్టినా జనాలకు ఉపయోగపడలేదు. వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసే ప్రయత్నం కూడా చేయలేదు.యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేశామని చెప్పినా వాస్తవంలో కొరత కనిపించింది.

1577 కేంద్రాల్లో పోలింగ్ : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, మే 13: జిల్లా వ్యాప్తంగా 1577 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ మాధవీలత తన కుటుంబీకులతో కలిసి సోమవారం ఉదయం రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్దగల చున్నీలాల్‌జాజు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకుని మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలకు ప్రజలు పెద్దఎత్తున వస్తున్నారని చెప్పారు. సాయంత్రం 6 గంటకు ఎంతమంది క్యూలో నిలబడి ఓటు కోసం వేచి ఉంటారో అంతమందికి ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు.ప్రజలందరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

ముగ్గళ్ళలో ఉద్రిక్తత..

సీతానగరం, మే 13 : సీతానగరం మండలం ముగ్గళ్ళలోని 35వ పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాయంత్రం ఇద్దరు ఓటర్లు 36వ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడి ఉన్నారు. ఓటే వేసే సమయానికి పోలింగ్ బూత్ ఇది కాదని 35వ పోలింగ్ బూత్‌కు వెళ్ళాలని చెప్పి అనుమతి ఇవ్వమని 36 పోలింగ్ బూత్ బీఎల్‌వో రికమండ్ చేయగా పరుగున బూత్‌కు చేరుకునే సరికి సమయం 6.05 గంటలు కావడంతో 35 బూత్ బీఎల్‌వో ఉమాదేవి అనుమతి నిరాకరించారు. అయితే 35వ బూత్‌లో పోలీసులు నియమించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఓటింగ్ యంత్రాల వద్దకు ఓటర్లను తీసుకెళ్లేందుకు ఏవిధమైన అనుమతులు లేనప్పటికి ఉదయం నుంచి వృద్ధులను తీసుకుని నేరుగా వైసీపీకి ఓటేయించారని బీఎల్‌వో నిలువరించలేదని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం నాయకులు ఆందోళన చేపట్టారు. చాలా సేపు వారిని పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో ఫిర్యాదు ఇవ్వడానికి సిద్ధపడ్డారు.








ఓటేశాం : కూటమి అభ్యర్థులు వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ



ఓటేసిన కాంగ్రెస్ ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు గిడుగు రుద్రరాజు, బోడా వెంకట్



ఆదిరెడ్డి అప్పారావు



కేఎస్ జవహర్



ఓటేసిన వేలు చూపుతున్న పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు



ఇదిగో ఓటరు తీర్పు : నన్నయ వర్శిటీకి రాత్రి 11 గంటల సమయంలో ఈవీఎంలతో తరలివచ్చిన పోలింగ్ సిబ్బంది

స్ట్రాంగ్ రూమ్‌కు ఓటరు తీర్పు

నన్నయ వర్శిటీ స్ట్రాంగ్ రూమ్‌లలో అభ్యర్థుల జాతకాలు

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి)/రాజానగరం : జిల్లాలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకూ వరకూ పోలింగ్ సాగింది. రాజానగరం మండలం వెలుగుబంద 167 పోలింగ్ కేంద్రంలో రాత్రి 11.30 గంటలకు పోలింగ్ ముగిసింది. గోపాలపురం మండలం గంగోలు 14వ పోలింగ్ బూత్ వద్ద రాత్రి 11.30 గంటలకు 30 మంది ఓటర్లు క్యూలో ఉన్నారు. నిడదవోలు మండలం సూరాపురం 14వ పోలింగ్ బూత్‌లోనూ రాత్రి వరకూ పోలింగ్ సాగింది. జిల్లాలో మొత్తం 83మంది అభ్యర్థులు పోటీ చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన పోటీ టీడీపీ-జనసేన..బీజేపీ కూటమి, వైసీపీ మధ్యే జరిగింది. కాంగ్రెస్ కూడా కొంతమేర పోటీ ఉన్నట్టు అనిపించింది. పోలింగ్ ప్రశాతంగా ముగిసినట్టే. కానీ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడతాయి.ఆ రోజు ఓట్లు లెక్కిస్తారు. అప్పటి వరకూ ప్రస్తుతం ఓటర్లు వేసిన ఓట్లను తనలో దాచుకున్న ఈవీఎంలను దివాన్‌చెరువులోని ఆదికవి నన్నయ్య వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లలో నిక్షిప్తం చేస్తున్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలతో పాటు లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల భద్రతకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ రాత్రి 10 గంటలకు నన్నయ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఈవీఎంలన్నీ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరేసరికి అర్ధరాత్రి దాటిపోవచ్చు. తెల్లారినా తెల్లవారవచ్చు.ఈ మేరకు 14 స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ వరకూ అవి భద్రతాధికారుల నిఘా కిందే ఉంటాయి.





ముగ్గళ్లలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం


దొమ్మేరులో ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు

దొమ్మేరులో టీడీపీ, వైసీపీ నాయకుల ఘర్షణ

కొవ్వూరు, మే 13: కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మంగళవారం దొమ్మేరు జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుని ఘర్షణకు దిగారు. సమాచారం తెలుసుకున్న సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు పార్టీల కార్యకర్తలను అక్కడనుంచి పంపించివేశారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన పోలీసు ఎన్నికల అబ్జర్వర్ బలరాం మీనా సంఘటనపై వివరాలు సేకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.


ఘర్షణ వివరాలు తెలుసుకుంటున్న పోలీసు ఎన్నికల అబ్జర్వర్ బలరాం మీనా

ఓటు వేయడానికి నరకయాతన

» సిద్ధార్థనగర్ స్కూల్లో మందకొడి పోలింగ్‌తో ఇబ్బందులు
» పోలింగ్ బూత్‌ల్లోకి యథేచ్ఛగా సెల్‌ఫోన్లు



రాజమహేంద్రవరంలో ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్న ఓటర్లు

రాజమహేంద్రవరం అర్బన్, మే 13 : రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ ఏరియాలోని అనేక పోలింగ్ బూత్‌ల్లో ప్రశాంతంగా ఓటు వేయడానికి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక కారణాలు చూపుతూ బూత్‌ల్లోని పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయలేకపోవడంతో ఓటర్లకు అవస్థలు తప్పలేదు. పోలీస్ బందోబస్తు అంతంతమాత్రంగానే ఉండడంతో ఓటర్లను నియంత్రించే అవకాశం లేకుండా పోయింది. కొన్ని బూత్‌ల్లో ఓటర్లు ఓటు వేయడానికి తోపులాడుకోవాల్సి వచ్చింది. దీనికితోడు పోలింగ్ బూత్‌ల వద్ద పూర్తిస్థాయిలో మంచినీటి సౌకర్యం అరకొరగా ఏర్పాటు చేయడం, క్యూలైన్లలోని వారికి ఫ్యాన్లు లేకపోవడంతో ఎండవేడిమి, ఉక్కపోతతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రధానంగా సిద్ధార్థనగర్ మున్సిపల్ స్కూల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. బూత్ నెం. 24లో ఓటు వేయడానికి ఓటర్లు గంటల సమయం వేచి చూడాల్సి వచ్చింది. ఇక్కడే ఉన్న మరికొన్ని బూత్‌ల్లోనూ ఇలాంటి పరిస్థితులు కనిపించాయి. క్యూలైన్లు సక్రమంగా నిర్వర్తించలేదు. పోలీస్ తనిఖీలు లేకపోవడంతో అనేక మంది ఓటర్లు సెల్‌ఫోన్లను దర్జాగా బూత్‌ల్లోకి తీసుకెళ్లిపోవడం గమనార్హం. క్యూ లైన్లలో సెల్ఫీలు తీసుకోవడం విశేషం.

వ్యక్తిపై కేసు నమోదు

కొవ్వూరు, మే 13 : ఒక వ్యక్తిని కర్రతో కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. దొమ్మేరుకు చెందిన నేలపాట అవినాష్ ఈ నెల 12వ తేదీ రాత్రి దొమ్మేరు కొత్తపేట నుంచి సావరం బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో చిన్నం రాంబాబు కలిసి ఇంటివరకు లిఫ్ట్ అడిగాడు. బైక్ ఎక్కించుకుని ఇంటి సమీపంలో దించుతుండగా రాంబాబు కుమారుడు సుధీర్ వచ్చి మా నాన్నను అర్ధరాత్రి బైక్ ఎక్కించుకుని తిప్పుతున్నావా అంటూ అవినాష్‌ను కర్రతో కొట్టి, కాళ్లతో తన్ని గాయపర్చాడు. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. అవినాష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు బాబూరావు తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ


ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ ఆదినారాయణ

నిడదవోలు, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం దిశా డీఎస్పీ బి.ఆదినారాయణ నిడదవోలు మండలం కాటకూటేశ్వరంలో పోలింగ్ కేంద్రాన్ని, బందోబస్తును పరిశీలించి పోలీస్ అధికార్లకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

సుభద్రంపేటలో వైసీపీ నాయకుల దాడి

రంగంపేట, మే 13: మండలంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్‌బూత్‌ల దగ్గర బారులుతీరారు. కొన్ని పోలింగ్‌బూత్‌లలో ఉదయం 7గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సుభద్రంపేటలో పోలింగ్‌బూత్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గుద్దటి సూరిబాబుపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో కాలు విరిగింది. దీంతో అతడిని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం సూరిబాబును నియోజకవర్గ కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మండలంలో వడిశలేరు, బాలవరం ,మరికొన్ని గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

850/800.. నల్లజర్లలో ఎంపీ ఓట్లు తేడా

నల్లజర్ల, మే 13: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నల్లజర్ల 171 పోలింగ్ బూత్‌లో 800 ఓట్లు పోలయ్యాయి. ఎమ్మెల్యే అభ్యర్థికి 800 సరిపోగా ఎంపీ అభ్యర్థికి 850 వచ్చాయి. అధికంగా 50 ఓట్లు రావడంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు. అలాగే అదే విధంగా తెలికిచర్ల 166 బూత్‌లో పీవోగా పని చేస్తున్న జానికీ దివ్యాంగులు, వృద్ధులను తీసుకుని వెళ్లి సైకిల్, కమలం గుర్తులపై ఓటు వేస్తున్నారని అక్కడ వైసీపీ నాయకులు ఆరోపించడంతో ఆర్‌వో ఆమెను విధుల నుంచి తొలగించారు. అలాగే సుభద్రపాలెంలో, బిరుదుగడ్డ మంగమ్మ అనే దివ్యాంగురాలిని బూత్‌లో పని చేస్తున్న గుణ్ణంపల్లి అంగన్‌వాడీ టీచర్ సైకిల్,కమలం గుర్తులపై వేసిందని వైసీపీ నేతలు ఆరోపించడంతో ఆమెను విధుల నుంచి తొలగించారు.

పెరుగుతు.. తగ్గుతు.. పోలింగ్ సరళి



నల్లజర్ల, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సరళి తగ్గుతూ పెరుగుతూ వచ్చింది. ఉదయం 10గంటల వరకు 30శాతం వచ్చిన పోలింగ్ ఎండలకు ఓటర్లు ఇంటి ముఖం పట్టారు. సాయంత్రం 3గంటల నుంచి వెళ్లి ఓటు వేసేందుకు క్యూలో ఉంటే సాయంత్రం 7గంటలైన ఓటు వేసి అవకాశం రాలేదు. మండల వ్యాప్తంగా 6గంటలకు 75.23శాతం ఓట్లు పోలైనాయి. కొన్ని గ్రామాల్లో రాత్రి సైతం ఓట్లు వేసేందుకు ఓటర్లు క్యూ లైన్‌లో ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న నేతలు

రాజమహేంద్రవరం సిటీ, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ, జనసేన నేతలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, 8వ డివిజన్‌లో జనసేన నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, స్థానిక 50వ డివిజన్ తోలత్ మెమోరియల్ స్కూల్‌లోను తమతమ ఓటు హక్కును వినియోగించారు. ప్రజలే తమ ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించబోతున్నారని వారు చెప్పారు. అనుశ్రీ సత్యనారాయణ నగరంలో 13,14,15, 9,50, 42,47,6,25 డివిజన్లలో పోలింగ్‌స్టేషన్లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.


కొవ్వూరు బాలుర హైస్కూల్ వద్ద పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


నిడదవోలులో ఈవీఎంలు మొరాయించడంతో లైన్‌లో నిలిచిపోయిన ఓటర్లు


కొవ్వూరు: పశివేదల ఎంపీపీ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు

ఓటు పడింది!

» సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విజయవంతం
» పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
» నిర్దేశిత సమయం దాటి ఓటింగ్
» గంటల తరబడి లైన్లలో వేచి ఉన్న ఓటర్లు
» ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళలు, వృద్ధులు

తాళ్లపూడి/నిడదవోలు/నల్లజర్ల/కొవ్వూరు/చాగల్లు/గోపాలపురం/దేవరపల్లి/పెరవలి, మే 13: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అయ్యింది. వేసవి ఎండలు అధికంగా ఉండడంతో ఉదయం 6గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల పోలింగ్ నెమ్మదిగా జరగడంతో ఓటర్లు ఎండలో వేచి ఉండక తప్పలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు 144సెక్షన్ అమలుచేసి పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం 6గంటలు దాటినా పోలింగ్ కేంద్రాల్లో వందలాది ఓటర్లు ఉండడంతో లైన్‌లో ఉన్న వారందరికి ఎన్నికల సిబ్బంది స్లిప్‌లు అందించి పోలింగ్ నిర్వహించారు. కాగా పోలింగ్ ప్రారంభ సమయంలో పలు బూత్‌లలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లు మొరాయించాయి. మండలంలోని వేగేశ్వరపురం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట తదితర గ్రామాల్లో ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఓటేసేందుకు బారులు దీరిన ఓటర్లు అసహనానికి గురయ్యారు. ఓటర్లు వెనుదిరగడంతో సిబ్బంది వారిని పిలిచి త్వరగా సరిచేస్తామని చెప్పినప్పటికీ పనిచేయని మిషన్లతో మమ్మల్ని ఇబ్బందులు పెడతారా అని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కారణంతో ఆయా బూత్‌లలో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమయ్యింది. మరోవైపు బీప్ సౌండ్ రావడానికి ఎక్కువ సమయం పడుతుండడంతో ఓటర్లు అయోమయానికి గురై వాగ్వాదానికి దిగారు. దీని వల్ల పలు బూత్‌లలో సాయంత్రం 6 గంటలు దాటినప్పటికీ వందల కొద్దీ ఓటర్లు లైనులో ఉన్నారు. తాళ్లపూడి హైస్కూల్ బూత్ వద్ద 6గంటల కన్నా ముందుగానే ఇద్దరు ఓటర్లు లోపలి వెళ్లడానికి ప్రయత్నించగా వైసీపీ నేతలు అడ్డుకోవడంతో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. ఈలోగా 6గంటలు అవ్వడంతో పోలీసులు ఆ ఓటర్లను అనుమతించలేదు.

రాత్రి 9 గంటలకు 81.34శాతం పోలింగ్

కొవ్వూరు, మే 13: కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రాత్రి 9గంటలకు 81.34 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. నియోజకవర్గంలోని కొవ్వూరు పట్టణం, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లోని 176 పోలింగ్ కేంద్రాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. ఉదయం 5-30 గంటలకు ఎన్నికల అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ చేపట్టారు. ఈ ప్రక్రియలో అక్కడక్కడ చిన్న చిన్న సమస్యలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అయితే పోలింగ్ మాత్రం నెమ్మదిగా జరగడంతో సాయంత్రం 6గంటలు దాటినా వందలాదిగా ఓటర్లు లైన్‌లోనే ఉన్నారు.

● గోపాలపురం నియోజకవర్గంలో రాత్రి 9గంటల సమయానికి 80.93శాతం ఓట్లు పోలయ్యాయి. వారిలో పురుషులు 96,823 కాగా మహిళలు 99,643ఓట్లు, ఇతరులు 4. రాత్రి 9గంటలు దాటిన తర్వాత కూడా కొన్నిచోట్ల పోలింగ్ కొనసాగినట్టు విశ్వసనీయ సమాచారం.

● నిడదవోలు పట్టణంలోని రొంగల అమ్మిరాజు మున్సిపల్ ప్రైమరీ స్కూల్ భవనంలో 27వ పోలింగ్ బూత్‌లో ప్రారంభం కావలసిన ఓటింగ్ ఈవీఎంలు మొరాయించడంతో ఉదయం 7:35గం. వరకు ఓటింగ్ ప్రారంభం కాలేదు. అలాగే జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 34వ పోలింగ్‌బూత్‌లో మధ్యాహ్నం 11గంటల నుంచి 12గంటల వరకు ఈవీఎంలు నిలిచిపోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని శంకరాపురంలో 17వ నెంబరు పోలింగ్‌బూత్‌లో 15నిమిషాలకు పైగా ఓటింగ్ యంత్రాలు మొరాయించాయి. అధికారులు సాంకేతిక సమస్యను పరిష్కరించడంతో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామ్‌నగర్‌లోని 27వ పోలింగ్ బూత్‌లో వైసీపీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆయన భార్య సుమలత, కుమారుడు వరుణ్‌సాయితో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాడిమళ్లలో సుమారు 200 మందికి పైగా ఓటర్లు ఆరు గంటల సమయానికి ముందు లైన్‌లో ఉండడంతో వారందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందని అధికార్లు పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా ఏర్పాట్లు.. నిడదవోలులోని టక్కరిబాబా పేటలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు తూతూ మంత్రంగా ఒక టెంట్ వేసి వదిలేయడంతో ఓటర్లు ఓటు వేసేందుకు ఎండలోనే నిలబడ్డారు. వేడిమి ప్రభావానికి నానా అవస్థలు పడ్డారు. అయితే ఓటర్లు ఎండలో నిలబడి ఉన్నా అధికార్లు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎన్నికల ఏర్పాట్ల గురించి బహిరంగంగా ప్రజలు విమర్శించారు.

వృద్ధురాలికి దివ్యాంగుడి సాయం.. కాటకూటేశ్వరంలో ఓటు వేసేందుకు పోల్నాటి రామాయమ్మ అనే వృద్ధురాలికి వెలుగుల ఆంజనేయులు అనే దివ్యాంగుడు సాయం చేస్తూ తన ఎడమ చేతిని ఆమెకు అందించి ఒకరికి ఒకరు తోడుగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చారు.

● నల్లజర్ల మండలం చీపురుగూడెంలో 150 పోలింగ్ బూత్ ఈవీఎం సక్రమంగా పని చేయకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11గంటలకు క్యూలో ఉన్న వారు సాయంత్రం 6 గంటలైనా ఓటు వేసే అవకాశం లేకపోయింది. మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాల వద్ద పడిగాపులు కాసారు. పోలీస్ సిబ్బంది ఒకరు మాత్రమే ఉండడంతో ఓటర్లు ఒక్కసారిగా లోపలికి ప్రవేశించారు. అలాగే దూబచర్ల 207, ఘంటావారిగూడెం 201, పుల్లలపాడు182, జగన్నాథపురం 178, ప్రకాశరావుపాలెం 170, 167 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరయించాయి. మండిపోయే ఎండలను సైతం లెక్క చేయకుండా ఓటర్లు ఓటేసేందుకు క్యూలో ఉన్నారు. ప్రకాశరావుపాలెంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కడ పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం నల్లజర్ల, ఆవపాడు, పోతవరం, చీపురుగూడెం, పోతవరంలో పసుమర్తి రతీష్,గన్నమనేని వెంకటేశ్వరరావు, ఏలేటి సత్యనారాయణ, ఎంఎస్, అబ్బూరి నరేష్, అబ్బూరి పట్టియ్య, ఎంపీటీసీ మండా సత్యనారాయణలతో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కాగా మండల వ్యాప్తంగా సాయంత్రం 5గంటలకు 73.32 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. అనంతపల్లి, చీపురుగూడెం, తెలికిచర్ల, పోతవరం, ఆవపాడు, దూబచర్ల, ఘంటావారిగూడెం, నల్లజర్ల గ్రామాల్లో పోలింగ్ కొనసాగింది. రాత్రి 10గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉన్నట్టు చెప్పారు.

● కొవ్వూరు మండలం దొమ్మేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాయంత్రం దాటిన తరువాత సుమారు 450 మంది వరకు ఓటర్లు లైన్‌లో వేచి ఉన్నారు. వారందిరికి పోలింగ్ అధికారి స్లిప్‌లు అందజేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, అచ్చాయమ్మకాలనీ, క్రిస్టియన్ పేట, బ్రిడ్జిపేట, గౌతమీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఔరంగాబాద్, మండలంలోని తోగుమ్మి, వాడపల్లి, మద్దూరులో ఒక బూత్, పంగిడి, దేచర్ల, ధర్మవరం, పెనకనమెట్ట, కుమారదేవం, నందమూరు గ్రామాల్లో సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత లైన్‌లో ఓటర్లు అధికంగా ఉన్నారు. దీంతో అధికారులు వారికి స్లిప్‌లు అందజేసి పోలింగ్ నిర్వహించారు. దొమ్మేరులో టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. పట్టణ, మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిపై పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. కొవ్వూరు అచ్చాయమ్మకాలనీలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, క్రిస్టియన్‌పేటలో కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొంతా శ్యాం రవిప్రకాష్, దొమ్మేరులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా దేవరపల్లి మండలంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● చాగల్లు మండలంలో నిర్దీత సమయం తర్వాత కూడా పోలింగ్‌బూత్ 112, 116, 117, 118, 160 లలో నిలబడి వారు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చాగల్లులోని 118, ఊనగట్లలోని 119లో ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. 7గంటల సమయానికి సుమారు 75శాతం పోలింగ్ జరగగా అనేక బూత్‌లలో ఓటర్లు వేచి ఉండడంతో పోలింగ్ పూర్తయ్యేందుకు ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

● ఉండ్రాజవరం మండలంలోని 15 గ్రామాల్లో 58 పోలింగ్ కేంద్రాలు ద్వారా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తాడిపర్రులో రెండు, పాలంగిలో రెండు పోలింగ్ బూత్‌లలో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండలంలో మొత్తం 62362 వేల ఓటర్లు ఉండగా, పురుషులు 30,366, మహిళలు 31995 మంది ఉన్నారు. ఓటింగ్ త్వరగా ప్రారంభించినా కొన్నిచోట్ల ఈవీఎంలు పనిచేయలేదు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వేలివెన్నులో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిన్నచిన్న ఘర్షణలు తప్ప ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఎస్‌ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

● దేవరపల్లి మండలంలో ఉదయం 7గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి 8గంటల వరకు కూడా కొన్ని బూత్‌లలో పోలింగ్ జరిగింది. గౌరీపట్నంలో ఈవీఎం మొరాయించటంతో కొద్ది సేపు అంతరాయం ఏర్పడింది. ధూమంతనగూడెంలో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు దీరారు. ఎండలో ఉన్నప్పటికీ టెంట్లు వేయకపోవడంతో ఎండలోనే ఎక్కువ సేపు ఉన్నారు. దేవరపల్లి 60, 61, 62, 63 పోలింగ్‌బూత్‌లలో రాత్రి 8.30వరకు పోలింగ్ జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరగకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 8గంటలకు ఎన్నికల వచ్చిన నివేదిక మేరకు 77.57శాతం పోలింగ్ అయ్యింది. యర్నగూడెంలో హోం మంత్రి తానేటి వనిత, చిన్నాయిగూడెం స్టాక్‌నగర్‌లో కొవ్వూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఓటు వేశారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి మండలంలోని గౌరీపట్నంలో ఓటింగ్ కేంద్రాలను, మంత్రి వనిత యర్నగూడెం, యాదవోలు, దేవరపల్లి గ్రామాల్లోని ఓటింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.


కొవ్వూరులో హోం మంత్రి వనిత, మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి దంపతులు


వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి, ఎల్‌సీపీ అభ్యర్థి శ్యామ్, రాజీవ్‌కృష్ణ


నిడదవోలు రామ్‌నగర్‌లో ఓటేసిన ఎమ్మెల్యే జీఎస్ నాయుడు, కుటుంబం


దేవరపల్లిలో


ధూమంతనగూడెంలో ఎండలో నిల్చున్న ఓటర్లు


వృద్ధుడిని ఓటేసేందుకు తీసుకొస్తున్న వలంటీర్లు, వృద్ధురాలిని తీసుకొస్తున్న దివ్యాంగుడు

● పెరవలి మండలంలోని 18 గ్రామాల్లో 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటలకే పోలింగ్‌మొదలైంది. కాగా వేసవి కాలం మధ్యాహ్నం ఎండను తట్టుకోలేక సాయంత్రం వెళదామనే ఉద్దేశంతో ఓటర్లు ఉండిపోయారు. అయితే కొన్ని పోలింగ్‌బూత్‌లలో నత్తనడకన ఓటింగ్ పక్రియ కొనసాగడంతో మధ్యాహ్నం వరకు సగం కూడా ఓటర్లు ఓటు వేయలేకపోయారు. దీంతో చాలా పోలింగ్‌కేంద్రాల నుంచి ఓటర్లు ఇళ్లకు వెళ్ళిపోయారు. మళ్ళీ సాయంత్రం సమయంలో పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. సాయంత్రం 5గంటల నుంచి చాలా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ పూర్తయ్యింది. కొన్ని కేంద్రాల్లో మాత్రం రాత్రి 9, 10 గంటల వరకు ఇంకా కొనసాగింది. గుతూనే ఉంది. కాకరపర్రు బూత్ నెంబర్ 165లో 1450 మంది ఓటర్లు ఉండడంతో జనం కిక్కిరిసిపోయారు. మధ్యాహ్నం ఇళ్లకు వెళ్ళిపోయి సాయంత్రం మళ్ళీ వచ్చారు. అలాగే ముక్కామల, ఖండవల్లి, కానూరు, తీపర్రు, పెరవలిలో రాత్రి పొద్దుపోయే వరకు ఓట్లు వేస్తూనే ఉన్నారు.


పెరవలిలో రాత్రి సమయంలో ఓటేసేందుకు వేచి ఉన్న ఓటర్లు


ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి


చాగల్లు: మల్లవరంలో ఓటేసిన యువ ఓటర్లు

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ మూకల దాడి

» కొమరిపాలెంలో ఎంపీపీ జ్యోతిర్మయి పోలీసులపై ఓవరాక్షన్
» బిక్కవోలు మండలం కాపవరం, ఊలపల్లి గ్రామాల్లో ఘర్షణ
» అధికారులకు నల్లమిల్లి ఫిర్యాదు


గాయపడ్డ వ్యక్తిని పరామర్శిస్తున్న నల్లమిల్లి

అనపర్తి మే 13: పెదపూడి మండలం గొల్లల మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో పోలింగ్ బూత్ వద్ద సచివాలయ కార్యదర్శి దుర్గా ప్రసాద్ ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తుండడంతో టీడీపీ కార్యకర్తలు కార్యదర్శిని నిలదీశారు. ఎటువంటి పోలింగ్ పాసులు లేకుండా పోలింగ్ స్టేషన్‌లో ఉండటంపై కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే బలభద్రపురంలో ఆశ వర్కర్ వైసీపీకి ప్రచారం నిర్వహిస్తుండడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. రంగాపురంలో ముగ్గురు అన్నదమ్ములపై వైసీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఇరువర్గాల సోదరులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిని కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

కొమరిపాలెంలో వైసీపీ ఎంపీపీ హల్‌చల్

బిక్కవోలు మండలం కొమరిపాలెంలో పోలింగ్‌స్టేషన్ ఓటింగ్ సరళి పరిశీలించేందుకు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆయనతో పాటుగా నలుగురు వ్యక్తులు ఉండటంతో ఎంపీపీ జ్యోతిర్మయి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీనితో టీడీపీ శ్రేణులు ముందుకు రావడంతో కొద్దిసేపు రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది, చివరకు పోలీసులు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. రాళ్ల దాడిలో గాయపడిన కార్యకర్తలను ఆసుపత్రిలో నల్లమిల్లి పరామర్శించారు.

ధవళేశ్వరంలో స్వల్ప ఉద్రిక్తత

ధవళేశ్వరం, మే 13: స్థానిక కొత్తపేటలోని ఎంపీపీ స్కూల్ వద్ద వైసీపీ నాయకుడు, అతని సోదరుడు కలిసి టీడీపీ నాయకుడు నాళ్ల రమేష్, అతని భార్యపై దాడి చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు వాసిరెడ్డి రాంబాబు, నాళ్ల రమేష్‌ను పరామర్శించి, తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. బాధితుడు రమేష్ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు

రాళ్లు రువ్వుకున్న వైసీపీ, టీడీపీ శ్రేణులు

గోకవరం, మే 13: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలో రెండు, మూడు గ్రామాల్లో చిన్నపాటి ఘర్షణలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం మధ్య ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. అయితే కృష్ణునిపాలెంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తల పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడడంతో అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రెండు పార్టీల కార్యకర్తలు ఒకరిపైఒకరు రాళ్లు రువ్వుకునే వరకు పరిస్థితి వెళ్లింది. చివరకు పోలీసులు అక్కడికి చేసకుని వివాదాన్ని సద్దుమణిగింపజేశారు. అచ్యుతాపురం, గోకవరం, రంపయర్రంపాలెం, కృష్ణునిపాలెంలో రాత్రి 8.30గంటల వరకు ఓటర్ల లైన్లోనే నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అచ్యుతాపురంలో పలుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడ డంతో పోలింగ్ ఆలస్యంగా పూర్తయింది. కాగా అచ్యుతాపురం, గుమ్మళ్ళదొడ్డి, వెదురుపాక, గోకవరం, పెంటపల్లిలో పోలింగ్‌ను జ్యోతుల నవీన్ పరిశీలించారు.